

ముగిసిన టెన్నిస్ పోటీలు
భువనగిరి పట్టణంలో కొనసాగుతున్న అండర్-18 అంతర్జాతీయ స్థాయి టెన్నిస్ పోటీలు శనివారం ముగిశాయి. - 8లో



శ్రీవాణి తరహాలోనే గరుడ ట్రస్టు
తిరుమల శ్రీవాణి తరహాలో యాదగిరి క్షేత్రంలో భక్తుల సౌకర్యార్థం శ్రీగరుడ ట్రస్టు ఏర్పాటు చేశారు. - 8లో



యువకుడు సురక్షితం
మూసీలో పడి వరదలో చిక్కుకున్న యువకుడిని ఎస్‌డీఆర్‌ఎఫ్, ఫైర్ సిబ్బంది సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. - 8లో

న్యూస్‌రీల్

భూములిచ్చాం.. ఉపాధి కల్పించండి



వినతిపత్రం అందజేస్తున్న బూడిద కులస్తులు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయ పునర్నిర్మాణానికి భూములు ఇచ్చామని.. తమకు ఉపాధి కల్పించి ఆదుకోవాలని కోరుతూ యాదగిరిగుట్ట మండలంలోని యాదగిరిపల్లికి చెందిన బూడిద కులస్తులు శనివారం యాదగిరిగుట్ట ఆలయ డిప్యూటీ ఈఓ భాస్కర్‌శర్మకు వినతిపత్రం అందజేశారు. ఆలయంలో టెండర్లు లేకుండా చెప్పులు భద్రపరిచే బాధ్యతలు ఇవ్వాలని, స్వామివారి నిత్య కల్యాణంలో డప్పులు వాయించే అవకాశం కల్పించాలని, దేవస్థానంలోని అన్ని విభాగాల్లో ఔట్‌సోర్సింగ్ విధానంలో తమ కులస్తులను నియమించాలన్నారు. కోరారు. కార్యక్రమంలో నర్సింహ, నాగరాజు, ఐలయ్య, మల్లేశ్, యాదగిరి, అయిలయ్య, దేవేందర్, రాములు, కుమార్, వెంకటేష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులకు సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌ఓ

భువనగిరి: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని డీఎంహెచ్‌ఓ మనోహర్ అన్నారు. శనివారం భువనగిరి మండలం అనంతారం పరిధిలోని మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని ఆయన పరిశీలించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి, వ్యక్తిగత శుభ్రత పాటించాలని విద్యార్థులకు సూచించారు.

వాహనాల దారి మళ్లింపు



యాదగిరిగుట్టలో ఫ్లై ఓవర్ వద్ద ఏర్పాటు చేసిన సూచిక బోర్డులు

యాదగిరిగుట్ట: యాదగిరి కొండపైకి నిర్మిస్తున్న ఫ్లై ఓవర్ పనులు పునఃప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ట్రాఫిక్‌కు అంతరాయం తలెత్తకుండా ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టారు. తుర్కపల్లి, మల్లాపూర్ గ్రామాలకు వెళ్లే వాహనాలను పాత వాసవిసత్రం నుంచి తులసి సత్రం మీదుగా రెడ్డి సత్రం దగ్గర తుర్కపల్లి మెయిన్ రోడ్డుకు మళ్లించనున్నారు. తుర్కపల్లి, మల్లాపూర్ నుంచి వచ్చే వాహనాలను రింగ్ రోడ్డులోని యాదవఋషి సర్కిల్ నుంచి గరుడ సర్కిల్ మీదుగా వైకుంఠద్వారం వైపు మళ్లించనున్నారు. ఇక్కడినుంచి భారీ వాహనాలకు అనుమతి లేదని, వైకుంఠద్వారం నుంచి గరుడ యాదవ ఋషి సర్కిళ్ల గుండా మల్లాపూర్, తు ర్కపల్లి రావడానికి, పోవడానికి వీలు కల్పించారు.

70,614 ఇళ్లలో జ్వర సర్వే పూర్తి

- 80,904 మందికి వైద్య పరీక్షలు
- 1,697 మంది జ్వరపీడితుల గుర్తింపు

సాక్షి,యాదాద్రి: జిల్లాలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. వర్షాలు కురుస్తుండటంతో ఉధృతి మరింత పెరిగింది. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులకు రోగుల తాకిడి పెరిగింది. ఈ నేపథ్యంలో అప్రమత్తమైన వైద్యారోగ్య శాఖ.. వ్యాధుల వ్యాప్తిని కట్టడి చేసేందుకు ఇంటింటా చేపట్టిన జ్వర సర్వే చేపట్టింది. మొత్తం 424 గ్రామాల్లో జ్వర సర్వే నిర్వహించి అవసరమైన చోట మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశారు.

సర్వే చేసిన గృహాలు

జిల్లాలో ఈనెల 21నుంచి 30వ తేదీ వరకు 70,614 ఇళ్లలో ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు జ్వర సర్వే చేశారు. 24 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, మూడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల పరిధిలో 80,904 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా.. అందులో 1,697 మందికి వైరల్ ఫివర్ వచ్చినట్టు గుర్తించారు. వారికి చికిత్స చేయడంతో పాటు మందులు పంపిణీ చేశారు. 1,518 మంది జ్వరం నుంచి రికవరీ కాగా మిగతా వాళ్లు కూడా కోలుకుంటున్నారని కలెక్టర్ హనుమంతరావు తెలిపారు.

వర్షాలు, పారిశుద్ధ్య లోపం

వర్షాలు, వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా వ్యాధుల వ్యాప్తి పెరిగిందని వైద్యులు చెబుతున్నారు. వీటికి తోడు వర్షాల వల్ల పారిశుద్ధ్యం లోపించింది. నీళ్లు నిలిచి దోమల వ్యాప్తి పెరగడంతో జనం జ్వరాల బారిన పడుతున్నారని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరిస్తున్నారు.



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యేలు

నిధులు కేటాయించాలని సీఎంకు వినతి

సాక్షి, యాదాద్రి : తమ నియోజకవర్గాల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని కోరుతూ ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు శనివారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. శాసనసభా సమావేశాల సందర్భంగా సీఎం చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. బస్వాపూర్ రిజర్వాయర్ ముంపు గ్రామాలైన బీఎన్ తిమ్మాపూర్, లప్పానాయక్‌తండాల నిర్వాసితులకు పరిహారం రూ.119 కోట్లు కేటాయించాలని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి కోరారు. బస్వాపూర్ రిజర్వాయర్‌ను నింపాలంటే బీఎన్ తిమ్మాపూర్‌ను తరలించాలని, గ్రామస్తులకు పరిహారం చెల్లిస్తేనే సాధ్యమవుతుందని సీఎంకు వివరించారు. ఆలేరు నియోజకవర్గంలో లో లెవల్ బ్రిడ్జిల ఎత్తు పెంచడానికి రూ.150 కోట్లు ఇవ్వాలని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య విన్నవించారు. తమ విజ్ఞప్తులను సీఎం సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యేలు తెలిపారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఎమ్మెల్యేలు వేముల వీరేశం, మందుల సామేల్, బాలునాయక్, బత్తుల లక్ష్మారెడ్డి, జైవీర్‌రెడ్డి ఉన్నారు.



ఉత్సవమూర్తులకు నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

నృసింహుడికి నిత్యారాధనలు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో శనివారం నిత్యారాధనలో భాగంగా ఉత్సవమూర్తులకు నిత్యకల్యాణం నేత్రపర్వంగా చేపట్టారు. వేకువజామున స్వామివారి మేల్కొలుపులో భాగంగా సుప్రభాత సేవ చేపట్టిన అర్చకులు.. గర్భాలయంలో స్వయంభూలు, ప్రతిష్ఠా అలంకార మూర్తులను నిజాభిషేకం, తులసీదళాలతో అర్చించారు. అనంతరం ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం, గజవాహనసేవ, స్వామి, అమ్మవారికి నిత్యకల్యాణ వేడుక, బ్రహ్మోత్సవం ఆగమశాస్త్రం ప్రకారం నిర్వహించారు. సాయంత్రం వేళ జోడు సేవలను మాడవీధిలో ఊరేగించారు.

హడలెత్తిస్తున్న శునకాలు

ఏడాదిలో 16,612 కుక్కకాటు కేసులు

- వెలుగులోకి రానివి వందల్లో..
- శునకాల నియంత్రణకు మొక్కుబడి చర్యలు
- మధ్యలోనే నిలిచిన 'యానిమల్ బర్త్ కంట్రోల్' కార్యక్రమం
- సర్వే బృందాలు గత సంవత్సరం గుర్తించిన శునకాలు 30 వేలకు పైనే..
- బయటకు వెళ్లాలంటేనే బెంబేలెత్తుతున్న జనం



గుర్తించిన శునకాల సంఖ్య	వీధి కుక్కలు
30,012	27,025
పెంపుడు కుక్కలు	కుక్కకాటు బాధితులు
2,987	16,612

భువనగిరిటౌన్ : జిల్లాలో వీధి కుక్కల బెడద రోజురోజుకూ తీవ్రమవుతోంది. ఎప్పుడు ఏ పక్క నుంచి దాడి చేస్తాయో తెలియడం లేదు. గుంపులుగా సంచరిస్తూ చిన్నారులు, రోడ్లపై ఒంటరిగా వెళ్లే వ్యక్తులు, మూగజీవాలపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. ఈనెల 8వ తేదీ వేకువజామున భువనగిరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో విఘ్నేష్ అనే యువకుడు వాకింగ్ చేస్తుండగా శునకం అకస్మాత్తుగా వచ్చి అతనిపై దాడి చేసింది. గాయాలపాలైన విఘ్నేష్‌ను తోటి వాకర్స్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఇటువంటి ఘటనలు ఏదో ఒక చోట నిత్యకృత్యం అయ్యాయి.

16,612 మందికి కుక్క కాటు

వీధి కుక్కల దాడిలో గాయపడిన వారి సంఖ్య ఏటా వందల్లో ఉంటుంది. ఆరోగ్య శాఖ లెక్కల ప్రకారం 2024 జనవరి నుంచి 2025 ఆగస్టు వరకు 16,624 మంది కుక్కల బారిన పడ్డారు. ఇది కేవలం ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన వారి సంఖ్య మాత్రమే. ప్రైవేట్ ఆస్పత్రులు, హైదరాబాద్‌కు వెళ్లి చికిత్స పొందిన వారు పెద్ద సంఖ్యలో ఉన్నారు.

సర్వే ప్రకారం 30వేల శునకాలు

జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో ప్రత్యేక బృందాలు గత ఏడాది సర్వే చేయగా 30 వేల శునకాలు ఉన్నట్లు తేలింది. వీటిలో కేవలం గ్రామ పంచాయతీల్లోనే 27,025 కుక్కలు ఉన్నాయి. అత్యధికంగా సంస్థాన్‌నారాయణపురంలో 400, ఆ తరువాత ఇదే మండలంలోని పుట్టపాకలో 300 వరకు శునకాలు ఉన్నట్లు గుర్తించారు. అతి తక్కువగా వలిగొండ మండలం నర్సిగూడెంలో 10లోపు ఉన్నట్లు సర్వే బృందాలు తేల్చాయి. ఇక మున్సిపాలిటీల విషయానికొస్తే భువనగిరిలో వెయ్యికి పైగా.. ఆలేరు, యాదగిరిగుట్ట, చౌటుప్పల్, భూదాన్‌పోచంపల్లి, మోత్కూరు పట్టణాల్లో సగటున 400 పైగా కుక్కలు ఉన్నాయని తేల్చారు.



భువనగిరి పట్టణంలోని ప్రగతినగర్‌లో గుంపుగా సంచరిస్తున్న కుక్కలు

గుంపులుగా సంచారం

రాత్రి, పగలు తేడా లేకుండా గుంపులుగుంపులుగా శునకాలు సంచరిస్తున్నాయి. వీధులు, రహదారులు, హోటళ్లు, ఫంక్షన్‌హాళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, మాంసం, చికెన్ దుకాణాలు.. ఇలా ఎక్కడ చూసినా పెద్ద సంఖ్యలో స్వైర విహారం చేస్తున్నాయి.ముఖ్యంగా రాత్రి వేళ, వేకువజామున బయటకు వెళ్లేవారికి ఇబ్బందులు తప్పడం లేదు. ఉన్నట్టుండి ఒక్కసారి మనుషులపైకి దాడి చేస్తుండటంతో భయాందోళన చెందుతున్నారు.

చిన్నారులపై దాడి చేస్తున్నాయి



వీధి కుక్కల సంచారం విపరీతంగా పెరిగింది. ప్రధానంగా చిన్నారులపై దాడిచేసి గాయపరుస్తున్నాయి. రాత్రి సమయంలో బయటకు వెళ్లాలంటే భయమేస్తుంది. ఎక్కడి నుంచి వచ్చి దాడి చేస్తాయో తెలియని పరిస్థితి ఉంది.

–కప్పల వసంత, మోత్కూరు

రాత్రి సమయంలో వెళ్లలేకపోతున్నాం



ఆలేరులో వీధి కుక్కల బెడత రోజురోజుకూ తీవ్రమవుతోంది. పాదాచారులతో పాటు వాహనదారులను వదలడం లేదు. రాత్రి సమయంలో వీధుల్లో వెళ్లలేకపోతున్నాం. కుక్కలతో పాటు కోతలు బెడత కూడా ఉంది.

–పులగం భాస్కర్, ఆలేరు

మధ్యలోనే ఆగిన ఏబీసీ

కుక్కల దాడులను సీరియస్‌గా తీసుకున్న హైకోర్టు.. వాటి సంతతిని నియంత్రించాలని గతంలో ఆదేశించింది. ఈ మేరకు కుక్కల సంతతి నియంత్రణపై ప్రభుత్వం దష్టి సారించింది. ఇందుకోసం జిల్లా కేంద్రమైన భువనగిరి శివారులో యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) సెంటర్ ఏర్పాటు చేసింది. ఓ ప్రైవేట్ ఏజెన్సీకి కుక్కల సంతతి నియంత్రణ బాధ్యతలను అప్పగించింది. ఒక్కో శునకానికి రూ.1600 చొప్పున చెల్లించడానికి ఒప్పందం కుదుర్చుకుంది. అయితే సంతతి నియంత్రణ కోసం కొన్ని శునకాలకు చికిత్స చేశారు. కానీ, బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో సదరు ఏజెన్సీ కాంట్రాక్ట్ నుంచి తప్పుకుంది. దీంతో శునకాల సంతతి నియంత్రణ కార్యక్రమం మధ్యలోనే ఆగిపోయింది.

వేడెక్కిన రాజకీయం

- 'స్థానిక' పోరుకు సిద్ధమవుతున్న ప్రభుత్వం
- గ్రామాల్లో నాయకుల హడావుడి
- కార్యకలాపాలను విస్తృతం చేసిన ప్రధాన రాజకీయ పక్షాలు

సాక్షి, యాదాద్రి: స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఎన్నికలకు ఉన్న అన్ని రకాల అడ్డంకులను తొలగించేందుకు కసరత్తు చేస్తోంది. ఈ నేపథ్యంలో పల్లెల్లో రాజకీయం వేడెక్కుతోంది. ఇప్పటికే గ్రామాల్లో ఎన్నికల హడావుడి మొదలైంది. ఒక వైపు స్థానిక ఎన్నికలకు ప్రభుత్వం సన్నద్ధమవుతుండటంతో ప్రధాన రాజకీయ పార్టీలు తమ కార్యకలాపాలను విస్తృతం చేశాయి.

ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజా సమస్యలే ఎజెండాగా విపక్షాలు

స్థానిక సంస్థల ఎన్నికలను ప్రధాన రాజకీయ పార్టీలన్నీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. ఏ క్షణంలోనైనా ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉందన్న ప్రచారంతో దూకుడు పెంచాయి. బీజేపీ, సీపీఎం, బీఆర్‌ఎస్ పార్టీలు ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంతో పాటు పెండింగ్ ప్రాజెక్టులతో పాటు క్షేత్ర సమస్యలపై దృష్టి సారించాయి.

ఏడాదిన్నర పాలనపై నమ్మకంతో కాంగ్రెస్

ఏడాదిన్నర కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై కాంగ్రెస్ ఆశలు పెట్టుకుంది. వీటితో పాటు భువనగిరి నియోజకవర్గంలో హెచ్‌ఎండీఏ నిధులతో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి శంకుస్థాపనలు చేశారు. అలాగే ఆలేరులో వ్యవసాయ మార్కెట్ గోదాముల నిర్మాణానికి శంకుస్థాపన, సాగునీటి కాలువలకు ప్రభుత్వం భారీగా నిధులు విడుదల చేసింది. సభలు ఏర్పాటు చేసి రేషన్‌కార్డుల పంపిణీ చేశారు.

ఓటరు జాబితాపై ఫోకస్

ఎన్నికల సంఘం ఓటరు ముసాయిదా జాబితాను ప్రకటించడంతో అన్ని రాజకీయ పార్టీలు ఓటర్లపై ఫోకస్ పెట్టాయి. జాబితాలో తప్పులను గుర్తించి ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకుపోవడంలో పోటీ పడుతున్నారు. సెప్టెంబర్ 2వ తేదీన తుది ఓటరు జాబితా వెలువడనుంది. ఈ క్రమంలో సర్పంచ్, వార్డు సభ్యులు, ఎంపీటీసీ, జెడ్పీటీసీలుగా పోటీ చేయాలనుకుంటున్న ఆశావహులు తమ అనుచరులతో ఓటరు జాబితాలను చెక్ చేస్తున్నారు. అంతేకాకుండా సామాజిక వర్గాల వారీగా ఓటర్లపై దృష్టిసారించాయి. మరో వైపు రిజర్వేషన్లపై ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది.

మూడో రోజూ రాకపోకలు బంద్



జూలూరు వద్ద లో లెవల్ వంతెన పైనుంచి రాకపోకలు సాగించకుండా ఏర్పాటు చేసిన బారికేడ్లు

భూదాన్‌పోచంపల్లి: మండలంలోని జూలూరు వద్ద శనివారం కూడా లోలెవల్ బ్రిడ్జి పైనుంచి మూసీ ఉధృతి కొనసాగింది. దాంతో భూదాన్‌పోచంపల్లి నుంచి బీబీనగర్‌కు మూడు రోజులుగా రాకపోకలు నిలిచిపోయాయి. భూదాన్ పోచంపల్లి మండలం జూలూరు జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతున్న బీబీనగర్ మండలం రుద్రవెల్లికి చెందిన 20 మంది విద్యార్థులు వరద కారణంగా మూడు రోజులుగా బడికి వెళ్లలేదు. మూసీ పొంగడం వల్ల ఈ నెలలో 10 రోజులు బడికి గైర్హాజరయ్యారు. రాకపోకలు నిలిచిన కారణంగా బీబీనగర్ ఎయిమ్స్ వెళ్లే రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. పోచంపల్లి మండల ప్రజలు భువనగిరికి పెద్దరావులపల్లి మీదుగా చుట్టూ తిరిగి వెళ్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి నిలిచిపోయిన హైలెవల్ బ్రిడ్జి పనులను పూర్తి చేయించాలని ఆయా మండలాల ప్రజలు కోరుతున్నారు.

తరగతి గదులకు తలుపుల్లేవు సార్

- కలెక్టర్‌కు విద్యార్థుల ఫిర్యాదు
- ఆలేరు రెసిడెన్షియల్ బాలికల పాఠశాల, కళాశాల తనిఖీ



ప్రార్థనలో మాట్లాడుతున్న కలెక్టర్

ఆలేరు: తరగతి గదులకు కిటికీలు, తలుపులు లేవు సార్, రాత్రి సమయంలో, వర్షాలు కురిసినప్పుడు విష పురుగులు వచ్చే అవకాశం ఉందని ఆలేరులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల, కళాశాల విద్యార్థినులు కలెక్టర్ హనుమంతరావు దృష్టికి తీసుకెళ్లారు. శనివారం పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి ప్రార్థన చేశారు. ఉపాధ్యాయులు, అధ్యాపకుల హాజరు వివరాలు తెలుసుకున్నారు. అనంతరం కూరగాయలు, నిత్యావసర సరుకుల నాణ్యతను పరిశీలించారు. తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు. తరగతి గదులకు కిటికీలు,తలుపులు లేక అసౌకర్యం కలుగుతుందని విద్యార్థినులతో పాటు ప్రిన్సిపాల్ మామిడి వెంకటమ్మ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. కిచెన్‌షెడ్ రేకుల కప్పు సరిగా లేక ఇబ్బంది అవుతుందని, పాఠశాలకు సరైన డ్రైయినేజీ వ్యవస్థ లేదని, ప్రహరీగోడకు మరమ్మతులు చేయించాలని కలెక్టర్‌ను కోరారు. వెంటనే కలెక్టర్ పంచాయతీరాజ్ ఈఈకి ఫోన్ చేసి పెండింగ్ సివిల్ పనులు, అవసరమైన మరమ్మతులు పూర్తి చేయించాలని ఆదేశించారు. పరిసరాల్లో పిచ్చిమొక్కలు,గడ్డిని తొలగించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌కు సూచించారు.

నాణ్యత లేని పప్పుధాన్యాల గుర్తింపు

నాణ్యత లేని పప్పుధాన్యాలను కలెక్టర్ గుర్తించారు. వాటిని వెంటనే మార్చాలన్నారు. రేషన్ సరుకులతో పాటు కూరగాయలు నాణ్యమైనవి వినియోగించాలని స్పష్టం చేశారు. తమ జీవిత లక్ష్యాలు ఏమిటని విద్యార్థులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. లక్ష్యాల సాధనకు నిరంతరం కృషి చేస్తూ ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

పని ప్రదేశాల్లో మహిళలకు భద్రత కల్పించాలి



ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

- కలెక్టర్ హనుమంతరావు

భువనగిరిటౌన్ : పని ప్రదేశాల్లో మహిళల భద్రత కోసం సురక్షితమైన వాతావరణం కల్పించాలని కల్పించాలని కలెక్టర్ హనుమంతరావు సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో యాక్షన్ ఎయిడ్ కర్ణాటక ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఆశా వర్కర్లతో నిర్వహించిన ఇంటర్‌ఫేస్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళల రక్షణ, అభివృద్ధి, సాధికారత కోసం అనేక చట్టాలు, పాలసీలు ఉన్నాయని, వాటిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పోష్ (పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ చట్టం) యాక్ట్ -2013 క్యాంపెయిన్‌లో భాగంగా యాక్షన్ ఎయిడ్ సంస్థ దేశవ్యాప్తంగా కార్యక్రమాలు చేపడుతుందని, మన జిల్లాలో కూడా నిర్వహించడం అభినందనీయమన్నారు. పోష్ చట్టం నిబంధనల ప్రకారం జిల్లాలోని అన్ని సంస్థల్లో అంతర్గత కమిటీలు ఏర్పాటు చేస్తున్నామని, ఇప్పటికే 150 కమిటీలు పూర్తయినట్లు తెలిపారు. జిల్లా సంక్షేమ అధికారి నర్సింహారావు, యాక్షన్ ఎయిడ్ కమిటీ సభ్యురాలు యాక్షన్ ఎయిడ్ సంస్థ కార్యక్రమాలపై మాట్లాడారు. కార్యక్రమంలో యాక్షన్ ఎయిడ్ సంస్థ కమ్యూనిటీ ట్రైనర్, హ్యూమన్ రైట్స్ డిఫెండర్ సురుపంగ శివలింగం, డీఎంహెచ్‌ఓ మనోహర్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ యశోద, ఆశా కార్యకర్తల నోడల్ ఆఫీసర్ డాక్టర్ వీణ, సీడీపీఓలు శైలజ, జ్యోత్స్న, ఫిర్యాదుల కమిటీ చైర్‌పర్సన్ డాక్టర్ ప్రమీళ, డీఎల్‌ఎస్‌ఏ అడ్వకేట్‌లు రాజశేఖర్, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

పక్కా భవనాలు.. తీరనున్న వెతలు

భువనగిరి, రామన్నపేట, ఆలేరు కోర్టులకు శాశ్వత భవనాలు

- నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం
- జిల్లా కోర్టు భవన సముదాయానికి సెప్టెంబర్ మొదటి వారంలో శంకుస్థాపన
- మాస్‌కుంట గుట్టపై కొనసాగుతున్న ఏర్పాట్లు



మాస్‌కుంట గుట్టపై ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన జడ్జి జయరాజ్

సాక్షి, యాదాద్రి : భువనగిరి, రామన్నపేట, ఆలేరు కోర్టులకు మహర్దశ పట్టనుంది. అద్దె భవనాల్లో సమస్యల నడుమ కొట్టుమిట్టాడుతున్న వాటికి శాశ్వత భవనాల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. జిల్లా కోర్టు భవన సముదాయాల నిర్మాణానికి రూ.81 కోట్లు, రామన్నపేట కోర్టు నూతన భవనాలు, రెసిడెన్సియల్ క్వార్టర్స్ నిర్మాణానికి రూ. 34.50 కోట్లు, ఆలేరు కోర్టుకు రూ.18 కోట్లు మంజూరయ్యాయి. కాగా జిల్లా కోర్టు భవన నిర్మాణానికి సెప్టెంబర్ మొదటి వారంలో రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి శంకుస్థాపన చేయనున్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు కొనసాగుతున్నాయి.

మాస్‌కుంట గుట్టపై పది ఎకరాలు కేటాయింపు

భువనగిరిలో ప్రస్తుతం కోర్టు నిర్వహిస్తున్న అద్దె భవనాలు అనువుగా లేవు. ఇరుకుగా ఉండటం, సౌకర్యాలు సరిగా లేకపోవడంతో కక్షిదారులకు సేవలందించడం, న్యాయమూర్తులు, అడ్వకేట్‌ల కార్యకలాపాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సమస్యను పలుమార్లు రాష్ట్ర హైకోర్టు దృష్టికి తీసుకెళ్లడంతో నూతన భవనాలను మంజూరు చేసింది. నూతన భవనాన్ని భువనగిరి సమీపంలోని మాస్‌కుంట గుట్టపై నిర్మించాలని నిర్ణయించారు. ఇందుకోసం గుట్టపై సర్వేనంబర్ 742లో ప్రభుత్వం పది ఎకరాల స్థలం కేటాయించింది. ఈ స్థలంలో నాలుగు అంతస్తుల్లో 12 భవనాలు నిర్మిస్తారు. జిల్లా కోర్టులు, న్యాయమూర్తుల క్వార్టర్స్, పరిపాలన భవనాలు, బార్ అసోసియేషన్ భవనం, పార్కులు, పార్కింగ్ ఏరియా, లాన్స్ రానున్నాయి. తొలుత కోర్టు భవనాలను, చుట్టూ ప్రహరీ, అంతర్గత రోడ్ల నిర్మాణంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తారు. న్యాయమూర్తుల క్వార్టర్స్, ఇతర నిర్మాణాలను తర్వాత చేపట్టనున్నారు. టెండర్ ప్రక్రియ పూర్తవడంతో గుట్టను చదును చేస్తున్నారు. జిల్లా ప్రధాన జడ్జి జయరాజ్ ఆధ్వర్యంలో ఇతర న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ ప్రతినిధులు, ఆర్‌అండ్‌బీ అధికారులు శంకుస్థాపన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

ఐదు ఎకరాల్లో రామన్నపేట కోర్టు

రామన్నపేట శివారులోని కొమ్మాయిగూడెం మార్గంలో సర్వే నంబర్ 584లో ఐదు ఎకరాల స్థలాన్ని కోర్టు నూతన భవనాల నిర్మాణానికి ప్రభుత్వం కేటాయించింది. నాలుగు భవనాల నిర్మాణానికి రూ.29 కోట్లు, క్వార్టర్స్‌కు రూ 5.50కోట్లు మంజూరయ్యాయి. త్వరలోనే పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

శంకుస్థాపనకు ఏర్పాట్లు జరుగుతున్నాయి

జిల్లా కోర్టు భవన నిర్మాణానికి మాస్‌కుంట గుట్టపై ప్రభుత్వం 10 ఎకరాల స్థలం కేటాయించింది. రూ.81 కోట్లు మంజూరు చేయగా పనుల నిర్వహణకు టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయ్యింది. భవన నిర్మాణ పనులకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి శంకుస్థాపన చేయనున్నారు. ఇందుకు సంబంధించి గుట్టపై ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నాం.

–జయరాజ్, జిల్లా ప్రధాన జడ్జి

నేత్రదానంతో మరొకరికి చూపు

బీబీనగర్: నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా బీబీనగర్ ఎయిమ్స్ వైద్య కళాశాలలో శనివారం నేత్రదానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. వార్డులను సందర్శించి నేత్రదానం ఆవశ్యతను రోగులకు తెలియజేయడంతో పాటు నేత్రదానంపై అపోహలను తొలగించారు. నేత్రదానం చేయడం ద్వారా ఒక మనిషి మరణించినా మరొకరి ద్వారా లోకాన్ని చూడవచ్చని వైద్యులు పేర్కొన్నారు. అంతకుముందు ర్యాలీ నిర్వహించారు. అదే విధంగా ప్రొస్థెటిక్, ఆర్థోటిక్ సేవలకు సంబంధించి విద్యార్థులకు శిక్షణ, పరిశోధనలపై ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌ను ఎయిమ్స్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ అహంతెమ్ శాంతాసింగ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎయిమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ అభిషేక్ ఆరోరా, డీన్ నితిన్ అశోక్‌జాన్, డిప్యూటీ డైరెక్టర్ బిపిన్ వర్గీస్, ఆర్థోపెడిక్ ప్రొఫెసర్ మహేశ్వర్‌లక్కిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎయిమ్స్‌లో జరిగిన నేత్రదాన పక్షోత్సవాల్లో పాల్గొన్న వైద్యులు, విద్యార్థులు

క్లుప్తంగా

తృటిలో తప్పిన ప్రమాదం

కొండమల్లేపల్లి: బస్సు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టిన ఘటన కొండమల్లేపల్లిలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఏపీ ఆర్టీసీ మాచర్ల డిపోకు చెందిన బస్సు మాచర్ల నుంచి హైదరాబాద్‌కు వెళ్లే క్రమంలో శనివారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో కొండమల్లేపల్లి చౌరస్తాకు చేరుకోగానే బస్టాండ్ సమీపంలో డ్రైవర్ నిద్ర మత్తు వల్ల రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌పై ఎక్కి కొంత దూరం వరకువెళ్లింది. డివైడర్ మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను ఢీకొట్టడంతో తేరుకున్న ఆర్టీసీ డ్రైవర్ సడన్ బ్రేక్ వేసి బస్సును ఆపాడు. దీంతో బస్సులో ఉన్న సుమారు 20 మంది ప్రయాణికులు ఎలాంటి ప్రమాదం జరగలేదు.

రోడ్డు ప్రమాదంలో సీఆర్‌పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ మృతి


శ్రీను (ఫైల్)

చివ్వెంల : అతి వేగంగా వస్తున్న డీసీఎం అదుపు తప్పి ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టడంతో సీఆర్పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ మృతి చెందారు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం బీబీగూడెం గ్రామ శివారులోని సూర్యాపేట–ఖమ్మం రహదారిపై శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..ఆత్మకూర్(ఎస్) మండల ఏనుబాముల గ్రామానికి చెందిన కలకోట్ల శ్రీను (47) సీఆర్‌పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్‌గా అస్సాంలో పనిచేస్తున్నారు. ఇటీవలే సెలవులపై వచ్చిన ఆయన శనివారం సూర్యాపేటలో బంధువుల ఇంట్లో దశదిన కర్మకు హాజరై తిరిగి బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యంలో బీబీగూడెం గ్రామ శివారులో ఖమ్మం నుంచి సూర్యాపేటకు వస్తున్న డీసీఎం బైక్‌ను ఎదురుగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీను తలకు తీవ్రగాయాలయ్యాయి. అతడిని సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్సపొందుతూ మృతి చెందారు. మృతుడి కుమారుడు రాకేష్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ వి.మహేశ్వర్ కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

నిడమనూరు: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన నిడమనూరు మండలం తుమ్మడంలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం తుమ్మడం గ్రామానికి చెందిన దుబ్బాకుల రమణారెడ్డి(46) గురువారం రాత్రి మద్యం మత్తులో తన అత్త మంగమ్మకు ఫోన్ చేసి ఆత్మహత్య చేసుకొంటానని చెప్పాడు. అనంతరం తన కిరాణ దుకాణంలోనే చీరతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తమ్ముడు కోటిరెడ్డి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సురేష్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు అమ్మాయిలు ఉన్నారు.

రామదూత వినాయక



చిట్యాల: చిట్యాల పట్టణంలో ఏర్పాటు చేసిన అయోధ్య రామమందిరంతోపాటు రాముడి విగ్రహంతో కూడిన వినాయకుడి ప్రతిమ పలువురిని ఆకట్టుకుంటోంది. రామదూత హనుమంతుడిలా ఉన్న ఈ విగ్రహం వద్ద భక్తులు పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు చేస్తున్నారు.

పర్యావరణ పరిరక్షకా.. కాగితపు గుజ్జు గణనాయక

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడలోని గణేష్ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన కాగితపు గుజ్జు గణపయ్య విగ్రహం భక్తులను ఆకట్టుకుంటోంది. ఉత్సవ కమిటీ సభ్యులు పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కడప జిల్లా ప్రొద్దుటూరులో ప్రత్యేకంగా రకరకాల కాగితాలతో తయారు చేయించి తెచ్చారు. 16 అడుగుల ఎత్తుగల ఈ విగ్రహంతోపాటు రథాన్ని రూ.2.50లక్షలతో చేయించారు. మరో రూ.50 వేలు ఖర్చు చేసి గణేష్ మార్కెట్‌లో ప్రతిష్ఠించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోనే కాగితపు గుజ్జుతో తయారు చేసిన బొజ్జ గణపయ్య విగ్రహాన్ని తొలిసారిగా మిర్యాలగూడలోనే ప్రతిష్ఠించడం విశేషం.





ఆలయం కాదు.. మండపమే

కోదాడ : వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా కోదాడ పట్టణంలోని 17వ వార్డు ఖమ్మం క్రాస్‌రోడ్డులో గల శ్రీనగర్ కాలనీలో ఎమ్మెల్యే పద్మావతి ఇంటి సమీపంలో భక్తులు భారీ సెట్టింగ్‌తో ఏర్పాటు చేసిన మండపం నిజమైన దేవాలయాన్ని తలపిస్తోంది. మండపం వద్ద విష్ణుమూర్తి పడుకొని ఉండగా అతడిపై నీరు పడే విధంగా ఫౌంటెయిన్ కూడా ఏర్పాటు చేశారు. రూ.7లక్షలకు పైగా ఖర్చు చేసి మందిరంలాంటి ఈ మండపాన్ని ఏర్పాటు చేసినట్లు ఆ వార్డు మాజీ కౌన్సిలర్ బత్తినేని హనుమంతరావు తెలిపారు.






లక్ష్మీగణపతి నమోస్తుతే..

నల్లగొండ పట్టణంలోని సావర్కర్ నగర్‌లో త్రిశూల్ సేన ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వినాయకి దేవి అలంకరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గణపతి విగ్రహం అబ్బురపరుస్తోంది. ఈ విగ్రహాన్నే వీరగణపతి, లక్ష్మీ గణపతి అని పిలుస్తారు. వినాయకి దేవి కథ గురించి ఇక్కడ ఫ్లెక్సీ ఏర్పాటు చేయడం మరో ప్రత్యేకత.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ



నీలగిరిలో కేధార్‌నాథుడు

నల్లగొండ పట్టణంలోని శ్రీనివాస్‌నగర్ కాలనీకి చెందిన సత్యనారాయణ అనే భక్తుడు ఇరవై ఐదేళ్లుగా తన ఇంట్లో ప్రత్యేక అలంకరణతో భారీ వినాయక విగ్రహాలను ఏర్పాటుచేస్తున్నారు. దీంట్లో భాగంగా ఈసారి కేథరీనాథుడి సెట్టింగ్‌తో విగ్రహం చేర్పాటు చేసి పూజలు నిర్వహిస్తున్నాడు. – సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ



లక్కుంటే.. పట్టుచీర



భూదాన్‌పోచంపల్లి : పోచంపల్లిలోని కొండాలక్ష్మణ్ బాపూజీ వీవర్స్ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో భక్తులను ఆకర్షించేందుకు నిర్వాహకులు లక్కీ డ్రా కూపన్లు పెట్టారు. రూ.100 చెల్లించి కూపన్ తీసుకొంటే గణేష్ నిమజ్జనం రోజున లక్కీ డ్రా ద్వారా మొదటి బహుమతి కింద రూ.22వేల పోచంపల్లి ఇక్కత్ పట్టుచీర, రెండవ బహుమతి రూ.15వేల పట్టుచీర, మూడవ బహుమతి రూ.7,800 పట్టుచీరతో పాటు మరో 20 మందికి రూ.2వేల విలువ చేసే మస్‌రైజ్డ్ చీరలను అందజేస్తామని ఏకేఎల్‌బీ వీవర్స్ మార్కెట్ అధ్యక్షుడు గుండు శ్రీరాములు తెలిపారు.



చదువుల సన్నిధిలా..

అర్వపల్లి: గణేష్ నవరాత్రి ఉత్సవాలు వచ్చాయంటే చాలు పిల్లల హడావుడి చెప్పతరం కాదు. పాఠశాలలకు వెళ్లివచ్చి సాయంత్రం నుంచి రాత్రి వరకు గణేశుడి మండపాల వద్దే గడుపుతుంటారు. అర్వపల్లిలోని తుంగతుర్తి రోడ్డులో ఏర్పాటు చేసిన మండపంలోని శనివారం రాత్రి కొందరు పిల్లలు గణేశుడి సన్నిధిలో ఇలా హోంవర్క్ చేసుకుంటూ కాపలాగా ఉన్నారు.

కుక్కకు మత్తు మందు ఇచ్చి ఇంట్లో చోరీ

గరిడేపల్లి : మండల పరిధిలోని ఎల్బీనగర్ గ్రామంలోని ఓ ఇంట్లో శనివారం రాత్రి కుక్కకు మత్తు మందు ఇచ్చిన దుండగులు చోరీకి పాల్పడ్డారు. గరిడేపల్లి ఎస్‌ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్బీనగర్‌కు చెందిన వల్లభనేని శ్రీనివాసరావు ఆస్పత్రిలో చూపించుకునేందుకు కుటుంబ సభ్యులతో కలిసి శనివారం ఉదయం ఇంటికి తాళం వేసి విజయవాడ వెళ్లారు. ఆదివారం ఉదయం పని మనిషి శ్రీనివాసరావు ఇంటి వద్దకు వెళ్లగా తలుపులు తీసి ఉండడం.. ఇంట్లోని బీరువా తలుపులు తెరిచి ఉండడంతో పక్కనే ఉన్న వారికి తెలియజేశారు. ఈ విషయాన్ని వెంటనే పోలీసులకు తెలపడంతో గరిడేపల్లి ఎస్‌ఐ చలికంటి నరేష్ తన సిబ్బందితో శ్రీనివాసరావు ఇంటికి వెళ్లి పరిశీలించారు. స్థానికులు ఫోన్ ద్వారా శ్రీనివాసరావుకు తెలపగా ఇంట్లో కొంత నగదు, బంగారం ఉన్నట్లు తెలిసింది. శ్రీనివాసరావు ఇంట్లో కుక్క ఉన్నప్పటికీ దానికి మత్తుమందు ఇచ్చి దొంగతనానికి పాల్పడడం పలు అనుమానాలకు తావిస్తోంది. తెలిసిన వారే ఈ చోరీకి పాల్పడి ఉండొచ్చని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.


ఇంట్లో తెరిచి ఉన్న బీరువా

శ్రీవాణి తరహాలోనే గరుడ ట్రస్టు

- ట్రస్టు ద్వారా వచ్చిన సొమ్ము విద్య, వైద్యం, ప్రసాద వితరణకు వినియోగం
- దాతలకు ప్రత్యేక దర్శన భాగ్యం
- విధివిధానాలు విడుదల చేసిన ఆలయ ఈఓ

యాదగిరిగుట్ట: తిరుమల తిరుపతి దేవస్థానంలో భక్తుల కోసం శ్రీవాణి ట్రస్టును ఏర్పాటు చేసిన విధంగానే యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం శ్రీగరుడ ట్రస్టును ఏర్పాటు చేశారు. అందుకు సంబంధించిన విధి విధానాలను శనివారం ఆలయ ఈఓ వెంకట్రావు వెల్లడించారు. గరుడ స్కీంకు వచ్చే విరాళాలను గరుడ ట్రస్టు పేరుతో అకౌంట్ ప్రారంభించి విద్య, వైద్యం, ప్రసాద వితరణ నిర్వహణకు వినియోగించనున్నారు. ఈ ట్రస్టును ఈ నెల 15న దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రారంభించగా.. 29వ తేదీన విధి విధానాలను రెవెన్యూ, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ పరిశీలించి విడుదల చేశారు.

మూడు స్లాట్లు.. ప్రత్యేక కూపన్లు..

గరుడ ట్రస్టును మూడు స్లాట్లుగా ఏర్పాటు చేశారు.



శ్రీ గరుడ ట్రస్టు స్లాట్‌లకు సంబంధించిన ఫ్లెక్సీ

విరాళాలుగా చెల్లించిన భక్తులకు వసతి కూపన్స్, దర్శనం కూపన్స్ అందజేసి దర్శన సదుపాయాలను కల్పించడంతో పాటు బాండ్ సైతం అందజేయనున్నారు. గరుడ స్కీంలో విరాళాలు సమర్పించే భక్తులు దేవస్థానం సెల్‌లో విరాళాలు సమర్పించి బాండ్, కూపన్స్‌ను పొందాలని ఆలయాధికారులు సూచిస్తున్నారు.

స్కీం వివరాలు ఇలా..

- రూ.50వేలు విరాళం చెల్లించిన భక్తులకు రూ.300 బ్రేక్ దర్శనాన్ని సంవత్సరంలో రెండు సార్లు ఆరుగురు చొప్పున లైఫ్‌టైమ్ ఇవ్వనున్నారు. రూ.150 ప్రత్యేక దర్శనం టిక్కెట్‌పై సంవత్సరంలో రెండు సార్లు ఆరుగురికి లైఫ్ టైమ్ ఉంటుంది. విరాళం చెల్లించిన మొదటిసారి శ్రీస్వామి వారి అభిషేకం లడ్డూ ప్రసాదం, శేష వస్త్రం (కల్యాణ శెల్లా, కనుము) అందజేస్తారు.
- రూ.లక్ష విరాళం చెల్లించిన భక్తులకు రూ.300 బ్రేక్ దర్శనాన్ని సంవత్సరంలో నాలుగు సార్లు ఆరుగురు చొప్పున లైఫ్‌టైమ్ ఇవ్వనున్నారు. రూ.150 ప్రత్యేక దర్శనం టిక్కెట్ పై సంవత్సరంలో నాలుగు సార్లు ఆరుగురు చొప్పున లైఫ్‌టైమ్ ఉంటుంది. విరాళం చెల్లించిన మొదటి సారి శ్రీస్వామి వారి అభిషేకం లడ్డూ ప్రసాదం, శేష వస్త్రం అందజేస్తారు.
- రూ.2లక్షల విరాళం చెల్లించిన భక్తులకు రూ.300 బ్రేక్ దర్శనాన్ని సంవత్సరంలో మూడు సార్లు ఎనిమిది మంది చొప్పున లైఫ్‌టైమ్ ఇవ్వనున్నారు. రూ.150 ప్రత్యేక దర్శనం టిక్కెట్ పై సంవత్సరంలో 8 సార్లు ఆరుగురికి దర్శనం ఉంటుంది. అంతే కాకుండా కొండ కింద యాదరుషి నిలయంలో డబుల్ బెడ్‌రూం గదిని సైతం కేటాయిస్తారు. వీటితో పాటు విరాళం చెల్లించిన మొదటి సారి శ్రీస్వామి వారి అభిషేకం లడ్డూ ప్రసాదం, శేష వస్త్రం బహూకరిస్తారు.

కల్తీదాణా తయారు చేస్తున్న ఇద్దరి అరెస్ట్


కేతేపల్లిలో కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ కొండల్‌రెడ్డి, చిత్రంలో నిందితులు

కేతేపల్లి: కల్తీ దాణాను తయారు చేసి కోళ్ల ఫామ్స్ యజమానులకు విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను శనివారం కేతేపల్లి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసుకు సంబంధించి వివరాలను శనివారం కేతేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి వెల్లడించారు. కేతేపల్లి మండలం చీకటిగూడెం గ్రామానికి చెందిన ఆల్దాసు సతీష్, బుద్దె కృష్ణలు సూర్యాపేట పట్టణంతోపాటు పరిసర ప్రాంతాల్లోని రైస్ మిల్లుల నుంచి నూకలు, తవుడు సేకరించి కోళ్ల ఫారాలకు దాణాను విక్రయిస్తున్నారు. వ్యాపార నిర్వహణ కోసం కేతేపల్లిలోని పడావుగా ఉన్న పాత రైస్‌మిల్ గోదామును కిరాయికి తీసుకున్నారు. అయితే తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో నూకలు, తవుడుతో కూడిన దాణాలో 30శాతం ఇసుకను కలిపి కల్తీ దాణాను తయారు చేసే దందాకు తెరలేపారు. తయారు చేసిన కల్తీ దాణాను డీసీఎంలో లోడ్ చేసి ఎలాంటి అనుమతులు లేకుండానే హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని కోళ్ల ఫారాల యజమానులకు అధిక ధరలకు విక్రయిస్తూ డబ్బులు సంపాదిస్తున్నారు. కోళ్ల కల్తీ దాణా తయారీ దందాపై స్థానిక పంచాయతీ కార్యదర్శి సయ్యద్ బాబా చేసిన ఫిర్యాదు మేరకు కేతేపల్లి ఎస్‌ఐ సతీష్ శనివారం తన సిబ్బందితో కలిసి గోదాముపై దాడి చేశారు. తనిఖీలో గోదాములో నిల్వ ఉన్న రూ.3.30 లక్షల విలువైన 245 బ్యాగుల కల్తీ కోళ్ల దాణా (122.5 క్వింటాళ్లు), 8 టన్నుల ఇసుకను పోలీసులు సీజ్ చేశారు. ఈ దాణా తిన్న కోళ్లతోపాటు వాటిని తిన్న మనుషుల ఆరోగ్యాలకు కూడా ముప్పు పొంచి ఉందని సీఐ తెలిపారు. విచారణ అనంతరం కల్తీ దాణా తయారు చేస్తున్న సతీష్, కృష్ణలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ వివరించారు. వారినుంచి డీసీఎం, టాటా నెక్సాన్ కారు, రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. సమావేశంలో కేతేపల్లి ఎస్‌ఐ యు.సతీష్, సిబ్బంది అనిల్‌రెడ్డి, సతీష్, సైదులు, రాంబాబు పాల్గొన్నారు.

పత్తి మిల్లు ఆస్తులు సీజ్

పెద్దవూర: మండల కేంద్రంలోని భోగమలో ఎంటర్ ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ స్పిన్నింగ్ మిల్లు ఆస్తులను సీజ్ చేసినట్లు నాగార్జునసాగర్ సర్కిల్ సీఐ శ్రీనునాయక్ శనివారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాలు.. మండల కేంద్రంలోని విశ్వనాథ్ స్పిన్నింగ్ మిల్లును నిర్వాహకులు భోగమలో ఎంటర్ ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం సారబ్ ప్రతానికి 8 ఏళ్లకు గాను లీజుకు ఇచ్చారు. స్పిన్నింగ్ మిల్లుకు కావాల్సిన రా మెటీరియల్ పంపిణీకి గజ్వేల్‌కు చెందిన తిరుమల ఎంటర్ ప్రైజెస్ నిర్వాహకుడు బుక్క రమేష్‌కు భోగమలో ఎంటర్ ప్రైజెస్‌కు 2025 జూన్ 30న ముంబైలో ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో తిరుమల ద్వారా గత నెల జూలైలో రూ.2,20,64,000 రా మెటీరియల్‌ను పంపించింది. వీనికి సంబంధించి డబ్బులు భోగమలో చెల్లించలేదు. తమకు బిల్లు చెల్లించకపోగా ఈనెల 17న మూడు లారీల పత్తి దారాలను అమ్ముకున్నట్లు తిరుమల నిర్వాహకుడు రమేష్ పిటీషన్ ఇచ్చారు. ఆయా యాజమాన్యాలపై ఛీటింగ్ కేసు నమోదు చేసి ఆస్తులు సీజ్ చేసి కోర్టుకు అప్పగించినట్లు సీఐ పేర్కొన్నారు.

మూసీలో చిక్కుకున్న యువకుడు సురక్షితం

- రాత్రంతా నదిలోనే మట్టిదిబ్బపై ఉన్న బాధితుడు మత్స్యగిరి
- శనివారం తెల్లవారుజామున ఒడ్డుకు చేర్చిన ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం

రామన్నపేట : ప్రమాదవశాత్తు మూసీనదిలో పడి వరద ప్రవాహంలో చిక్కుకున్న యువకుడు కానుకుంట్ల మత్స్యగిరిని ఎస్‌డీఆర్‌ఎఫ్, ఫైర్ సిబ్బంది శనివారం ఉదయం సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. రామన్నపేట మండలం లక్ష్మాపురం గ్రామానికి చెందిన మత్స్యగిరి శుక్రవారం సాయంత్రం ఏడు గంటల సమయంలో గ్రామం సమీపంలోని మూసీ వంతెనపై నుంచి ప్రమాదవశాత్తు మూసీనదిలో పడిపోయాడు. వరద ప్రవాహానికి సుమారు మూడువందల మీటర్ల దూరం వరకు కొట్టుకుపోయాడు. అదృష్ట వశాత్తు చెట్టును ఆసరా చేసుకొని పెద్ద మట్టిదిబ్బపైకి చేరాడు. అక్కడ ఉన్న వారు గమనించి వెంటనే పోలీసు, రెవెన్యూ, ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. తహసీల్దార్ లాల్ బహదూర్‌శాస్త్రి, సీఐ ఎస్.వెంకటేశ్వర్లు సంఘటనా స్థలానికి చేరుకొని ఉన్నతాధికారులకు సమాచారమిచ్చారు. ఉన్నతాధికారుల ఆదేశం మేరకు యాదగిరిగుట్ట నుంచి ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాన్ని రప్పించారు. యువకుడిని రక్షించేందుకు నదిలోకి పడవలో వెళ్లిన ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందంలోని ఒక సభ్యుడు నదిలో పడిపోగా మిగిలిన సభ్యులు అతడిని చాకచక్యంగా రక్షించారు. అనంతరం ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం సభ్యులు మత్స్యగిరి ఉన్న ప్రదేశానికి చేరుకోవడానికి విశ్వ ప్రయత్నం చేశారు. చీకటిగా ఉండడం, నది ప్రవాహం ఉధృతంగా పారుతుండడంతో అతడి వద్దకు చేరుకోలేక పోయారు. రాత్రి 12 గంటల తరువాత సహాయక చర్యలు నిలిపివేశారు.

రాతంత్రా వంతెనపైనే కాపాలా..


నదిలో చిక్కుకున్న మత్స్యగిరిని ఒడ్డుకు తీసుకొస్తున్న ఎస్‌డీఆర్‌ఎఫ్ సభ్యులు

మత్స్యగిరికి వెలుతురు కనిపించేలా అధికారులు అర్ధరాత్రి ట్రాక్టర్ లైట్లు ఏర్పాటు చేశారు. కుటుంబసభ్యులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, స్థానిక యువకులు వంతెనపైనే రాత్రంగా అతడిని గమనిస్తూ కాపాలా కాశారు. స్థానిక గ్రామ పంచాయతీ భవనంలోనే సేదదీరిన ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం శనివారం తెల్లవారుజామున 5గంటలకే సహాయక చర్యలను మొదలు పెట్టారు. ఉదయం 6:45 గంటలకు మత్స్యగిరిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. దీంతో గ్రామస్తులు, కుటుంబ సభ్యులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రాణాలను పణంగా పెట్టి మత్స్యగిరిని కాపాడిన ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం సభ్యులను గ్రామస్తులు, అధికారులు అభినందించారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, కలెక్టర్ హనుమంతరావు రాత్రంతా సహాయక చర్యలను పర్యవేక్షించారు. బయటకు వచ్చిన మత్స్యగిరి కలెక్టర్ ఫోన్‌లో పరామర్శించారు. ఆర్డీఓ శేఖర్‌రెడ్డి, ఏసీపీ మధుసూదన్‌రెడ్డి, డీఎఫ్ఓ మధుసూదన్ రావు, ఎస్ఎఫ్ఓ మధుసూదన్‌రెడ్డిలు సహాయక చర్యలను పర్యవేక్షించారు. సీఐ ఎస్.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎస్‌ఐలు డి.నాగరాజు, యుగంధర్‌లు సహాయక చర్యలకు ఆటంకం కలగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

ముగిసిన అంతర్జాతీయ టెన్నిస్ పోటీలు

భువనగిరి : భువనగిరి పట్టణంలోని సువాలి ఎస్టేట్‌లో గల న్యూ డైమెన్షన్ స్కూల్ ఆవరణంలో కొనసాగుతున్న అండర్–18 జూనియర్స్ బాలబాలికల అంతర్జాతీయ స్థాయి టెన్నిస్ పోటీలు శనివారం ముగిశాయి. వివిధ దేశాల నుంచి వచ్చిన క్రీడాకారులు ఆరు రోజుల పాటు పోటీల్లో పాల్గొని సందడి చేశారు. ముగింపు రోజున జరిగిన ఫైనల్స్‌లో గెలుపొందిన వారికి మెమొంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర టెన్నిస్ అకాడమీ ఉపాధ్యక్షుడు అశోక్‌కుమార్, తెలంగాణ స్టేట్ టెన్నిస్ అసోసియేషన్ మేనేజర్ వైభవ్ పటేల్, ,జిల్లా టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు సద్ది వెంకట్ రెడ్డి, ఉపాధ్యక్షులు దిడ్డి బాలాజీ, ప్రధాన కార్యదర్శి కలీం అహ్మద్, సంయుక్త కార్యదర్శి పరమేష్‌కుమార్, పాఠశాల యాజమాన్యం పాల్గొన్నారు.

విజేతలు ఎవరంటే..

బాలుర సింగిల్స్ ఫైనల్‌లో వ్రజ్ గోహిల్(ఇండియా), దెవ్ విపుల్ పటేట్ (ఇండియా)పై 6-1, 6-4 తేడాతో విజయం సాధించింది. బాలికల విభాగంలో స్నిగ్ధకాంత (ఇండియా), ఐశ్వర్య జాదవ్(ఇండియా)పై 5-7, 6-2,6-0 గెలుపొందింది.



విజేతలకు మెమొంటోలు అందజేస్తున్న నిర్వాహకులు


టెన్నిస్ ఆడుతున్న క్రీడాకారిణి

బాలుర డబుల్స్ ఫైనల్‌లో థామస్, కాప్పి (ఫ్రాన్స్), ప్రణవ్ మహేష్ సరవణకుమార్ (ఇండియా)లు, హృతిక్ కాటకం(ఇండియా), ప్రకాష్ సారణ్(ఇండియా)పై 6-4, 6-0తేడాతో విజయం సాధించారు. బాలికల విభాగంలో నైనికా నరేందర్ రెడ్డి బేంద్రం(ఇండియా), స్నిగ్ధ కాంత(ఇండియా)లు, శ్రీనిత్తి చౌదరి(ఇండియా), హర్షకార్తిక ఊరగంటి(ఇండియా)పై 5-1 తేడాతో రిటైర్డ్ మ్యాచ్‌లో విజయం సాధించారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

అనంతగిరి: మూడు రోజుల క్రితం పాలేరు వాగులో గల్లంతైన కోదాడ మండలం గోండ్రియాలకు చెందిన యువకుడు కిన్నెర ఉపేందర్ (28) మృతదేహం శనివారం ఉదయం గ్రామానికి కిలోమీటర్ దూరంలో లభ్యమైంది. ఇతడి కోసం మూడు రోజులుగా అనంతగిరి, కోదాడ రూరల్ పోలీసులతో పాటు అగ్నిమాపకశాఖ, ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలు గాలింపు చర్యలు చేపడుతూ వచ్చారు. ఈ మేరరకు కేసు నమోదు చేసుకున్న అనంతగిరి పోలీసులు కోదాడలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.